క్లుప్తంగా

క్రీడా పరికరాలు వితరణ



భీమవరం(వత్సవాయి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. గ్రామంలోని జెడ్పీ పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చులతో క్రీడా సామగ్రిని అందించారు. వాలీబాల్స్, నెట్స్, క్యారమ్ బోర్డులు, చెస్ బోర్డులు, టెన్నికాయిడ్ రాకెట్లు, షటిల్‌బ్యాట్స్, స్కిప్పింగ్ వంటివి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల ద్వారా కూడా ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఎంఈవో ఎల్ నాగరాజు, హెచ్‌ఎం రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపట్నుంచి దసరా ఉత్సవాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వతేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కిషోర్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 22న ఉదయం కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 29న మూలానక్షత్రం సందర్భంగా సరస్వతీ పూజ ఉంటుందన్నారు. 30న దుర్గాష్టమి, చండీహోమం, అక్టోబర్ 1న మహార్ణవమి, సాయంత్రం పూజ అనంతరం ఖుష్మాండ బలి ప్రదానం, ఉద్వాసన, 2న విజయదశమి సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో శమీపూజ, ఆయుధపూజ ఉంటుందన్నారు. అక్టోబర్ 4న అమ్మవారి విగ్రహ నిమజ్జన ఉత్సవం ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు సత్కారం



పెనుగంచిప్రోలు: నీట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఓపెన్ కేటగిరీలో మెడికల్‌లో సీట్లు సాధించిన స్థానిక శ్రీచైతన్య హైస్కూల్ పూర్వవిద్యార్థులు చిన్నం రుచిత, గణేష్‌లను శనివారం హైస్కూల్ ఆవరణలో సత్కరించారు. ఆర్‌ఐ వినోద్‌కుమార్, ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు కలిసి పూర్వవిద్యార్థులను సత్కరించి అభినందించారు.

నేటి నుంచి బతుకమ్మ ఉత్సవాలు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ఆయా ఆలయాల వద్ద ఆదివారం నుంచి బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొప్పు వెంకటఅనంతరాజా, తులసి సుబ్బారావు శనివారం తెలిపారు. 21వతేదీన పట్టణంలోని శ్రీసీతారామస్వామి దేవాలయం (పెద్ద రామాలయం), 22న శ్రీవరదరాజస్వామి వారి దేవాలయం, 23న శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయం, 24న శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం(పెద్ద శివాలయం), 25న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, 26న శ్రీకనకదుర్గ ఆలయం, 27 న శ్రీచెన్నకేశవస్వామి, 28న శ్రీరంగనాయకస్వామి, 29న శ్రీరేణుకా పరమేశ్వరి ఆలయాల వద్ద బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు నోముల శివకుమార్, కోశాధికారి యర్రా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు చెక్కా సుధాకర్ పాల్గొన్నారు.

పాఠ్యాంశాల బోధనపై సమీక్ష

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఒకటి నుంచి ఏడో తరగతి వరకు సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈవో–2 చిట్టిబాబు ఆదేశించారు. చిల్లకల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించటంతోపాటు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలన్నారు. ఈ కాంప్లెక్స్ చైర్మన్ రమణ, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

స్టీమ్ ల్యాబ్ సందర్శన

వీరులపాడు: మండలంలోని అల్లూరు, గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఏర్పాటు చేసిన స్టీమ్ ల్యాబ్‌ను జిల్లా సైన్స్ అధికారి పిచ్చేశ్వరరావు శనివారం సందర్శించారు. అనంతరం స్వచ్ఛత హైసేవా–2025 కార్యక్రమంలో భాగంగా 'సే నో ప్లాస్టిక్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వెంచర్ ధ్వంసం



కంచికచర్ల: మండలంలోని జుజ్జూరు రోడ్డులో ఎటువంటి అనుమతులు లేకుండా వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్‌ను సీఆర్‌డీఏ అధికారులు జేసీబీలతో శనివారం ధ్వంసం చేశారు. వెంచర్‌లోని ప్లాట్ల రాళ్లను సైతం పీకించేసి పంచాయతీ అధికారులకు అప్పగించారు. అనుమతులు లేకుండా వేసిన వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని అధికారులు సూచించారు.

ముందస్తు దసరా వేడుకలు

నందిగామరూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ముందస్తు విజయదశమి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని చందాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు రకాల పుష్పాలు, ఆకులతో విద్యార్థినులు బతుకమ్మను తయారు చేసి ప్రత్యేక పూజలు చేసి పాటలు పాడుతూ, బతుకమ్మలాడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ మాట్లాడుతూ పాఠశాలల్లో పండుగల సందర్భంగా వేడుకలు నిర్వహించడం ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతలపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని వివరించారు. పండుగల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసిన బతుకమ్మలు చూపరులను ఆకట్టుకున్నాయి.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: మండలంలోని గండ్రాయి, కెఅగ్రహారం, తిరుమలగిరి గ్రామాలలో శనివారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ముందస్తు దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మ ఆడారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ పండుగ విశిష్టత, సంప్రదాయాన్ని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, వెంకటేశ్వరరావు, శంకరన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నందిగామ మండలం చందాపురం జెడ్పీ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని జుజ్జూరులోని ఎంపీపీ మెయిన్ పాఠశాలలో శనివారం ముందస్తు దసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. పండుగ విశిష్టతకు అద్దం పట్టేలా విద్యార్థినులు బతుకమ్మలను తయారుచేసి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థుల కోలాట ప్రదర్శన, బతుకమ్మ ఆట చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంఈవోలు వెంకయ్య, పాల్‌కెనడీ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గండ్రాయిలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



జుజ్జూరులో దసరా వేడుకల్లో విద్యార్థులు, టీచర్లు

నవదుర్గల రూపాలు ప్రదర్శన..



జగ్గయ్యపేట జెడ్పీ పాఠశాలలో నవదుర్గల రూపాలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

జగ్గయ్యపేటఅర్బన్: దసరా శరన్నవరాత్రుల ప్రారంభంకానున్న నేపథ్యంలో పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో శనివారం విద్యార్థులు శక్తిమాత అమ్మవారి నవదుర్గల రూపాలను ప్రదర్శించారు. నవదుర్గల అలంకరణలో విద్యార్థినుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. హెచ్‌ఎం హేమమాధవి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమ్మవారి రూపాల ప్రాముఖ్యతను వివరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో విప్, ఎమ్మెల్యే సౌమ్య



మున్నలూరులో మొక్కలు నాటుతున్న డీఎల్‌పీఓ రాఘవన్, తహసీల్దార్ నరసింహారావు

నందిగామరూరల్: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. మండలంలోని మునగచర్లలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతోపాటు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ముఖ్యంగా తడిపొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని చంద్రన్న సామూహిక గోకులం షెడ్డును సందర్శించి మొక్కను నాటారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ నరసింహారావు, డీసీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : మండలంలోని మున్నలూరు గ్రామంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎల్‌పీఓ రాఘవన్, తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు మొక్కలు నాటారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మొక్కలు నాటాలని కోరారు. చాలన్నారు. అనంతరం క్లాప్ మిత్రలను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి కె.మురళి, ఆర్‌ఐ వెంకటరెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, ఏపీఓ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి ఫణీంద్ర, సచివాలయం సిబ్బంది, అంగనవాడీ కార్యకర్తలు, ఆశకార్యకర్తలు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు : సీపీఎం

నందిగామరూరల్: వైద్య కళాశాలల పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ చేసే విధానాలను కూటమి ప్రభుత్వం తక్షణమే ఉప సంహరించుకోవాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాం భూపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని ఎనిమిది వేల ఎకరాలను కారు చౌకగా ఎకరం రూ. 99 పైసలకు 60ఏళ్లకు లీజుకివ్వడం ఒక్క కూటమి ప్రభుత్వానికే చెల్లిందని విమర్శించారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే భవిష్యత్ తరాలకు వైద్యం ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. నిత్యావసర వస్తువులపై ఐదు శాతం జీఎస్టీ తగ్గించడం కాదని, నిత్యావసర వస్తువుల ఉత్పత్తిపై మార్కెట్ ధరపై 20 శాతం తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు డీవీ కృష్ణ, కోట కళ్యాణ్, కటారపు గోపాల్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జాతీయ ఉద్యమ స్ఫూర్తి దెబ్బతింటోంది

మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

నందిగామటౌన్: హిందుత్వ, కార్పొరేట్, మతోన్మాద రాజకీయాల వల్ల జాతీయ ఉద్యమ స్ఫూర్తి దెబ్బతింటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ పేర్కొన్నారు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో నిర్వహిస్తున్న సీపీఎం పార్టీ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. శర్మ మాట్లాడుతూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలతో దేశంలో లౌకికత్వం, స్వావలంబన, సామాజిక న్యాయం, దేశ సౌభ్రాతృత్వం పూర్తిగా నిర్వీర్యమవుతున్నాయన్నారు. హిందూత్వం ముసుగులో దేశ సంపదను విదేశీ కంపెనీలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. న్యాయవ్యవస్థలను సైతం తమవైపు తిప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. **గురజాడకు ఘన నివాళి...**

జాతీయ ఉద్యమ నాయకుడు, ప్రముఖ కవి గురజాడ అప్పారావు జయంతి వేడుకలను సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు డీవీ కృష్ణ, కోట కళ్యాణ్, హెచ్ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, కటారపు గోపాల్, సయ్యద్ ఖాశీం తదితరులు పాల్గొన్నారు.



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

'అమ్రితసాయి'లో హ్యాకథాన్ నిర్వహణ

కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఇంటర్నల్ హ్యాకథాన్ నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ అండ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఇన్నోవేషన్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్మార్ట్ ఇండియా–2025లో భాగంగా కళాశాలలో ఇంటర్నల్ హ్యాకథాన్ నిర్వహిస్తున్నామన్నారు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శశిధర్ మాట్లాడుతూ, విద్యార్థులకు స్మార్ట్ ఆటోమేషన్, స్మార్ట్ వెహికిల్స్, రోబోటిక్స్, డ్రోన్స్, క్లీన్ అండ్ గ్రీన్, టెక్నాలజీ, స్మార్ట్ ఎడ్యుకేషన్ డిసాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర 25 రకాల సాంకేతిక అంశాలలో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. సొసైటీలో ఉన్న 200 రకాల సాంకేతిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన నూతన సాంకేతికతను జోడిస్తూ ఏర్పాటు చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రోగ్రాం స్పోక్ డాక్టర్ ఎం.శ్రీదేవి, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హ్యాకథాన్‌లో భాగంగా పోస్టర్ ప్రజెంటేషన్ చేస్తున్న విద్యార్థి

ఆరోగ్య సంరక్షణపై మహిళలకు అవగాహన

నందిగామరూరల్: ప్రజల ఆరోగ్యకర జీవనమే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని వైద్యాధికారి విజయకృష్ణ పేర్కొన్నారు. స్వస్థ నారీ–శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండూరు గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బాలికలు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్, క్యాన్సర్‌తోపాటు ఆరోగ్య విషయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయకృష్ణ మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించ ద్వారా అనారోగ్యాల బారినుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కిశోర బాలికలతో కలిసి పోషకాహార ప్రాముఖ్యతపై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, గ్రామనాయకులు, వైద్యారోగ్య సిబ్బంది, అంగనవాడీ, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

పంటలసాగుపై కార్యాచరణ



గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని కెవీకెలో శనివారం సెప్టెంబరు కార్యాచరణపై జగ్గయ్యపేట డివిజన్ పరిధిలోని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సమావేశం జరిగింది. ఉద్యాన పంటల్లోని చీడపీడలు, ఎరువుల యాజమాన్యం, భూసార పరీక్షల ఆధారిత ఎరువుల వాడకం, రబీ పంటల సంసిద్ధత వంటి అంశాలపై చర్చించారు. సమావేశంలో శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, ఏడీఏ భవాని, ఏవోలు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నందిగామలో భారీ వర్షం

నందిగామటౌన్: నందిగామలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. అప్పటి వరకు వాతావరణం సాధారణంగానే ఉన్నప్పటికీ ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఒకింత సేద తీరినప్పటికీ రైతులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కురిసిన అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని, తాజా వర్షంతో పరిస్థితులు ఎలా ఉంటాయోనని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం

పెనుగంచిప్రోలు: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ మార్కపూడి గాంధీ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కుటుంబం అయినా అభివృద్ధి చెందాలంటే అది కేవలం విద్య ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఎంపీడీఓ జి శ్రీను మాట్లాడుతూ వెలుగు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలోని చదువుకున్న వారికి శిక్షణ ఇచ్చి వారి ద్వారా మండలంలో 3,800 మంది వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. జెడ్పీటీసీ పభ్యురాలు వూట్ల నాగమణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కోటేశ్వరి, ఎంఈఓ డి. రవీంద్ర, ఏపీఓ జనార్దనరావు, ఏఓ సిద్ధారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మార్కపూడి గాంధీ, పక్కన జెడ్పీటీసీ నాగమణి, ఎంపీడీవో శ్రీను

పనిగంటలు పెంచడం దుర్మార్గ చర్య

నందిగామ రూరల్: కార్మికులకు పనిగంటలు పెంచుతూ కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19న అసెంబ్లీలో పనిగంటలు పెంచుతూ చేసిన చట్టసవరణ చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికే కార్మికులు పనిభారంతో నలిగిపోతున్నారని ఇది చాలదన్నట్లు పని గంటలు పెంచడం కూటమి ప్రభుత్వ దుర్మార్గ చర్యకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో చేసిన చట్టాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలని లేకుంటే పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. పని గంటలను పెంచడాన్ని నిరసిస్తూ ఈ నెల 22న అన్ని పట్టణ, మండల, పారిశ్రామిక కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు కమల, గోపాల్, దుర్గారావు, నాగేశ్వరరావు, మహేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

కంచికచర్ల: స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) సెల్ ఆధ్వర్యంలో ఇంటర్నల్ స్మార్ట్ ఇండియా హాకథాన్(2025)ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీ వంశీకిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుని కొత్త ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, అంతర్గత హాకథాన్ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ పుల్లారావు, స్పోక్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, మేనేజ్‌మెంట్ సభ్యులు ఎం. సుహాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

నందిగామరూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు అంబారుపేటలోని సత్యమ్మ అమ్మవారి ఆలయం ముస్తాబైంది. రంగురంగుల విద్యుద్దీపాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా అమ్మవారు పలు అలంకారాలలో భక్తులకు దర్శనమిస్తారని ఈవో సీతారావమ్మ తెలిపారు. 22న రజతకవచాలంకృత అలంకారం, 23న బాలాత్రిపుర సుందరీదేవి, 24న గాయత్రి దేవి, 25న అన్నపూర్ణాదేవి, 26న శ్రీమహాలక్ష్మీ, 27న లలితా త్రిపుర సుందరీ దేవి, 28న మహా ఛండీ, 29న మూల నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు ఒకటిన మహిషాసురమర్ధిని, 2న రాజ రాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని వివరించారు. 22వతేదీ తెల్లవారుజామున ద్వారతోరణ పూజ, సుప్రభాతసేవ, దీక్షాధారణ, అఖండ దీపస్థాపన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ ఎక్కిన దంపతులు

వత్సవాయి: తమకు న్యాయం చేయాలని కోరుతూ దంపతులు ఓవర్‌హెడ్ ట్యాంక్ ఎక్కిన సంఘటన వత్సవాయిలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన మట్టిపల్లి కొమరయ్య, జి.నాగరాజు ఇరువురు కలిసి ఐదారేళ్ల కిందట మేకల వ్యాపారం చేశారు. ఈ క్రమంలో కొమరయ్య, నాగరాజుకు రూ.లక్షన్నర బాకీపడ్డాడు. కొంతకాలంగా ఖమ్మంలో ఉంటున్న కొమరయ్య ఆ నగదును చెల్లించే విషయంలో మాత్రం మాట దాటవేస్తున్నాడు. ఈక్రమంలో కొమరయ్య ఇటీవల వత్సవాయి రావడంతో అతని వద్ద ఉన్న వాహనాన్ని నాగరాజు లాక్కున్నాడు. దీంతో ఆందోళన చెందిన కొమరయ్య తనకు న్యాయం చేయాలని కోరుతూ భార్య నాగమల్లేశ్వరిని తీసుకుని ఓవర్‌హెడ్ ట్యాంక్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న పోలీస్, రెవెన్యూశాఖలకు చెందిన అధికారులు వచ్చి కొమరయ్య దంపతులకు నచ్చజెప్పి ట్యాంక్ నుంచి కిందకు దింపి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



ట్యాంక్ ఎక్కిన కొమరయ్య దంపతులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు :ఎస్‌ఐ

నందిగామటౌన్: ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించటంతోపాటు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఎస్‌ఐ అభిమన్యు సూచించారు. పట్టణంలోని గాంధీ సెంటరులో శనివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ ధారణ, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించటంతోపాటు లైసెన్స్, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని, విధిగా హెల్మెట్ ధరిస్తామంటూ వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్‌ఐ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నందిగామలో వాహనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌ఐ అభిమన్యు

ఎస్‌ఐ శంకర్‌నాయక్‌కు సత్కారం



జగ్గయ్యపేట అర్బన్: నూతనంగా జగ్గయ్యపేట పట్టణ ఎస్‌ఐ–2గా బాధ్యతలు చేపట్టిన భూక్యా శంకర్‌నాయక్‌ను సీపీఐ నాయకులు శనివారం కలిసి సత్కరించారు. ఎస్‌ఐను కలిసి అభినందించినవారిలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, న్యాయవాది జూనెబోయిన శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరిసె మధు, మండల కార్యదర్శి మెటికల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి షేక్ కరీం, వేమవరపు ఫ్రాన్సిస్ ఉన్నారు.

తిరుమలగిరిలో ఉత్సవాలు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ఆవరణలోని మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు రెండు వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో సాంబశివరావు శనివారం తెలిపారు. 22నుంచి ప్రతిరోజూ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేయనున్నట్లు వివరించారు.

పారిశుద్ధ్య ప్రాధాన్యంపై అవగాహన

వీరులపాడు: పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని పంచాయతీ రాజ్ ఏఈ రవికుమార్ సూచించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాటిగుమ్మి గ్రామంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాలు, ఖాళీ ప్రదేశాలలో నీటినిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ పలకా మోహన్‌రెడ్డి, కార్యదర్శి రత్నాకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా ర్యాలీలు..

జగ్గయ్యపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామ పంచాయతీలలో ర్యాలీలు నిర్వహించారు. చిల్లకల్లు, ధర్మవరప్పాడుతండ, గండ్రాయి గ్రామాలలో కార్యదర్శులు శివాజీ, సంధ్య, మంగ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ, ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో భూచవరం వైద్యాధికారి కీర్తిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.